20. పొద్దు తిరుగుడు పువ్వు

ఆమె పదిహేనవ ఏట-

దగ్గరి బంధువుల ఇంట్లో పెళ్ళికి వెళ్ళింది. పెళ్లికి వచ్చినవారి మాటల్ని బట్టి వరుడు ధనవంతుడనీ, రూపవంతుడనీ, విద్యాధికుడనీ, ఇంతమంచి వరుడుదొరకటం చాలా అదృష్టమనీ గ్రహించింది. వధూవరులు పీటల మీద కూర్చున్నప్పుడూ, మంగళహారతి పాటల్లో తను పాల్గొన్నప్పుడూ వరుణ్ని చాలా దగ్గర్నుంచి చూసింది...... తను విన్నమాటల్లో అతిశయోక్తి ఏమీ లేదని తెలుసుకుంది. నిజానికి చాలా అందగాడు. అతని కళ్ళల్లో విజ్ఞానకాంతీ, చురుకుదనమూ స్పష్టంగా కనిపిస్తున్నాయ్... తనక్కూడా ఇలాటి భర్తే దొరుకుతే... ఎంత అదృష్టం!

ఆక్షణంనుంచే ఆమె ఆలోచనలు వివాహ సమస్య మీద లగ్నమవ సాగినయ్. వరుణ్ని ఎన్నుకునే విషయంలో తల్లిదండ్రులు తనకు స్వాతంత్ర్యాన్ని ఇస్తారనీ, తనుమాత్రం మహా మెలకువతో ఉండి జీవిత సమస్యను ఎదుర్కోవాలనీ, ఏమాత్రం పొరపడ్డా కాలుజారి సుడిగుండంలో పడటం తప్పదనీ తెలుసుకుంది. అందులోనూ యీ సుడిగుండంలో పడితే చావటమూ కష్టమే- బతకటం అంతకన్నా కష్టం!

ఆ రాత్రి హఠాత్తుగా ఆమెకు రాజారావు జ్ఞాపకానికి వొచ్చాడు. అతను క్లాసులోకల్లా తెలివైన కుర్రవాడు. మాష్టర్లందరూ అతన్ని మెచ్చుకుంటారు. తనుకూడా తనకు తెలియకుండానే కొద్దిరోజుల్నుంచీ అతన్ని మెచ్చుకుంటున్నట్టు ఇప్పుడే తోచింది. అతని మీద ఎంతో ఇష్టంకూడా ఉన్నట్టు తెలుసుకునేందుకు ఆమెకు ఎక్కువసేపు

పట్టలేదు. అదివరకు అతని నోట్సు నాలుగైదుసార్లు అడిగితీసుకుంది. అంతకు మించిన పరిచయం యేమీలేదు.

మరికొంతసేపు ఆలోచించగా- రాజారావు తనకు తగిన భర్తగా కూడా తోచింది.... కాని అతని చదువూ తన చదువూ ఒక్కటే ఐతే? తమ పెళ్ళయ్యాక తను ఇంట్లో కూర్చోవొచ్చు. అతనింకా పెద్దచదువులకు వెళ్తాడు. ఈ విధంగా సరిపెట్టుకోవొచ్చు..... కాని తన వివాహ సమస్యను ఇంత త్వరగా తేల్చుకోవటంలో తొందరపడుతూన్నట్టు తోచింది. ఆలోచనలుకూడా పరిపక్వం కాకముందే తన హృదయంలో శాశ్వత స్థానానికి అవకాశాన్ని కల్పించటం కేవలం మౌఢ్యమే ననిపించింది.

ఏమైనా రాజారావు విషయం తరచాల్సిందే..... మర్నాడే అతన్ని ఇంటికి 'టీ'కి పిలిచింది. అతను వొచ్చాడు. కులాసా ధోరణిలోనే సంభాషణ సాగిపోయింది. రోజూ తనతో చదువుకునేందుకు రమ్మని ఆహ్వానించింది. మొదట్లో అతను ఇష్టపడలేదు. కాని కొంతసేపు బలవంతం చేశాక ఇష్టపడక తప్పలేదు.

అతను దగ్గరవుతున్నకొద్దీ అతని లోపాలు తనకు అర్థమవ సాగినయ్. అందులోనూ మొదటినుంచీ విమర్శనా దృష్టిలో బయలుదేరాక అతి త్వరలో ఆ లోపాలనేవి బైటపడక తప్పదు..... అతనంత చురుకుగా త్వరగా, తను ఏ విషయాన్నీ గ్రహించలేదు. అతను త్వరత్వరగా పాఠాలు చదువుకు పోతాడు. తనకు అంత త్వరగా అర్థమైచావవు. తనకోసం అతను ఆగే స్థితిలో ఉండడు! లెక్కల్లోకూడా అంతే. అసలు లెక్కలే అతని దగ్గర నేర్చుకోవాలని ఆమె ఆలోచన. తనకు అర్థంకానిచోట చెప్తాడు. కాని తను వెంటనే గ్రహించలేక, ఒకటికి నాలుగుసార్లు అనుమానాల్ని బైటపెట్టాల్సి వొచ్చేది. అప్పుడు విసుగుదల అతని ముఖంలో స్పష్టంగా తను చూడగలిగేది. వెంటనే తనకు కోపం కూడా వొచ్చేది. ఇలా తన మీద విసుక్కునేవాడి మీద తనకెలా ఇష్టం కలుగుతుందీ?

ఇంకోరకంగా రాజారావును పరీక్షించాలనుకుంది. రిబ్బన్లూ, సోపులూ, స్నోలూ, పౌడర్లూ తెచ్చిపెట్టమని అడిగింది. అతను జవాబు చెప్పకుండా ఒక్క క్షణం జాలిగా తన ముఖంలోకి చూసి వెళ్ళిపొయ్యాడు. అంతే! మళ్లీ తన ఇంటి ఛాయలక్కూడా అతను రాలేదు. స్కూల్లో కూడా మొహం తప్పించుకొని తిరిగేవాడు. సంగతేమిటో తెలుసుకొనేందుకు ఆమె సుందరరావు సహాయాన్ని కోరవలసి వచ్చింది.

రాజారావు ఏమీ లేనివాడనీ, వారాలమీద చదువుకుంటున్న దిక్కు లేని పక్షనీ విన్నక్షణాన కొన్ని క్షణాల వరకూ ఆమె మొద్దుబారిపోయింది. ఇంటికివొచ్చి ఆమె ఆలోచనలోపడ్డది. ఇంకా నయం. ఈ స్నేహం అనే వంకతో తనింకా ముందుకు

సాగినట్టయితే తను ఆ సుడిగుండంలో పడితీరేది. ఆ రాజారావుకే తను భార్య అయినట్టయితే... రిబ్బన్లూ, సోపులూ, పౌడర్లూ లేకపోతేపోయె.. మాధాకవళంకూడు తనకు తప్పేది కాదు. పైన ఆకాశంలో పసిడి సింహాసనం మీద దిటాయించి కూర్చున్న సర్వేశ్వరుడే తనను యీ ప్రమాదం నుంచి తప్పించినందుకు, వాడికి హృదయ పూర్వకంగా కృతజ్ఞతాభివందనాల్ని అర్పించింది.

ఈ దుర్దశలో సుందర్రావు తనకోసం రాకపోకలు సాగించాడు. పేరుకుతగినంత సుందరరూపుడు కాకపోయినా, స్వరూపం ఏవగింపును మాత్రం కలిగించదు. కనుకనే ఆమె దృష్టి వెంటనే సుందర్రావు మీద లగ్నమైంది. సుందర్రావు సందుచివర ఉండగానే, అతనికారు హారన్ తనకు పరాకు చెప్తుంది. మరీ అతని కారులో బీచిమీదికి షికారువెళ్తే ఎంత ఆనందం! తను సుందర్రావును ఎందుకు పెళ్ళిచేసుకోకూడదూ? ఐనా మరికొంత ఆలోచించాలి.

అడక్కముందే రిబ్బన్లూ, ఊలూ, సబ్బులూ, పౌడర్లూ, స్నోలూ ఇంకెన్నో తనకు తెలియనివీ, సమయానికి జ్ఞాపకంరానివీ, సుందర్రావు దిగుమతి చేస్తూనే ఉన్నాడు. కాని సుందర్రావు బుర్ర మహాగట్టిది. అది ఏ రకం కొబ్బరి పెంకోకాని, చదువుమాత్రం లోనికి జొరబడటం చాలాకష్టం. కలిసి చదువు కునేప్పుడు తనను చూస్తూ లొట్టలేస్తూ కూర్చునేవాడు. ఆ చూపు తనను గాయపరుస్తూన్నట్టు ఉండేది. మెరుగు కాగితంతో శరీరమంతా పాలిష్ చేస్తూన్నంత బాధ కలిగేది. ఎలాగైనా అతనిచేత చదివించాలని తేలికభాషలో చెప్పేది. కాని అతనికి అర్థమయ్యేది కాదో, లేక తనచేత మళ్ళీ మళ్లీ చెప్పించుకోవాలనో తిరిగి తిరిగి అడిగేవాడు. తను విసుక్కొనేది, దాంతో అతను దమ్మిడీ అంత ముఖం చేసుకుని కూర్చునేవాడు. తను ఓదార్చుదా మనుకొనేది కాని ఈ రకమైన అలుసివ్వటం తనకు ఇష్టముండేది కాదు. ఫ్లాస్కులో వున్న టీ అంతా తాగికూడా ఎనిమిది కాకముందే పుస్తకాలమాటా, పరీక్షాపత్రాలమాటా, మార్కులు పంచటంలో ఎగ్జామినర్ల పిసినిగొట్టుతనం మాటా, అంతా మరిచిపోయి గురకపెడుతూ కుంభకర్ణ పర్వంలో నిమగ్నమయ్యేవాడు. అతని సోమరితనమూ, నిద్రా, మరీ రాత్రిపూట పసిపిల్లలు భయపడేట్టు శబ్దం చేసే ఆ పాడు గురకా చూస్తే ఆమెకు వెర్రికోపం వొచ్చేది. ఆ ఉచ్ఛ్వాస నిశ్వాసాలకు లాంతరు దగ్గరజేరిన పురుగులు అతని నాశికా రంధ్రాల గుండా ముందుకూ వెనక్కూ సీజన్ టిక్కెట్ వ్యవహారంగా తిరగటంచూస్తే నవ్వు కూడా వొచ్చేది. ఆ క్షణంలోనే అతని కారూ, అతను తనకోసం అయాచితంగా తెచ్చే బహుమానాలూ, దయకోసం ప్రదర్శించే వినయమూ – ఇవ్వేమీ అతని నేరాల్ని కప్పిపుచ్చేవిగా తోచేవి కావు. అతని మట్టిబుర్ర సిమెంటు కట్టడం అనటం సమంజసం – అతని యీ ప్రవర్తన అతన్నొక పశువురూపంలో చూసేందుకు మాత్రమే సహాయపడేది.

ఎలాగైనా యీ సుందర్రావును వొదిలించుకోవాలనే ప్రయత్నంలో ఉండగానే - తను ప్యాసవటమూ, అతను తప్పటమూ - కొంతదూరాన్ని ఇద్దరిమధ్యా ఏర్పరచి అతని పీడను వొదిలించినవి.

ఈ సంవత్సరం ఆమె సమస్య మరీ తీవ్రరూపం దాల్చింది. తన వయస్సంతా గడిచిపోతూన్నట్టూ, విలువైన కాలమంతా త్వరత్వరగా తనకు కొరగాకుండానే సాగిపోతూన్నట్టూ ఆమెకు తోచింది. ఇంట్లో తల్లిదండ్రులుకూడా తన వివాహ సమస్యమీద తీవ్రంగా చర్చిస్తూ తొందరపడుతూన్నట్టు కూడా గ్రహించింది. ఇలా తను ఆలస్యం చేస్తూ కాలయాపనచేస్తే మాత్రం తల్లిదండ్రులు తమకు నచ్చినవాడికి తనను అంటగట్టక మానరు కనుక త్వరగా మేలుకోవాలని, తరువాత పశ్చాత్తాపపడి లాభంలేదనీ తెలుసుకుంది.

ఈ కొత్త సంవత్సరంలో ప్రసాదరావు ఆమె హృదయాన్ని వెంటనే ఆకర్షించ గలిగాడు. అతను తనలాటి కన్యల్ని ఇట్టే ఆకర్షించగల సమర్థుడనేందుకు సందేహం లేదు. తను ఇతన్ని పెళ్ళాడితే...?

మామూలు తోవనే ప్రసాదరావుక్కూడా స్నేహప్రాంగణంలోకి ప్రవేశార్హత లభ్యమైంది. అతను ముక్కోపి. హాస్యానికి అన్నా చిర్రుబుర్రుమంటాడు. కాని ఎదుటివ్యక్తిని మాత్రం ముందువెనుకలు ఆలోచించకుండా ఎంత ఎగతాళైనా చేస్తాడు. మరీ అతని వ్యవహారం ఇతర్లను గాయపరచటమూ, కాని ఇతర్ల చేత గాయిపడకుండా ఉండటమూ యీ రెంటికి ఎక్కుపెట్టినట్టు ఉండేది. చదువుసంధ్యల మాట అటుంచి తనను ఒంటరిగా దగ్గరకు లాక్కునేందుకు ప్రయత్నించాడు. ఆమెకు కోపంవొచ్చింది. కాని కోపాన్ని ప్రదర్శించి ఆ దూముడిని పీటముడిగా చేయకుండా జాగర్తగా, తెలివిగా ఏవో సాకులు కల్పించి తప్పించుకుంది. అతనిలా తొందరపడుతూ, తన వెంటపడి తననుంచి ఏం ఆశిస్తున్నాడో గ్రహించేందుకు ఆమెకు ఎక్కువసేపు పట్టలేదు. తీగెకదిలిస్తే కంపంతా లేచినట్టు స్కూల్లోకూడా గోడలూ, బ్లాక్‌బోర్డులూ చెడటం మొదలుపెట్టినయ్. దాంతో జ్ఞానోదయమైంది. చాలా శ్రమపడి, బెదిరింపులతో తిట్లతో అతన్ని వొదిలించు కునేప్పటికి తాతలు దిగివొచ్చారు.

అలసటను తీర్చుకోవటంలో మరికొంత కాలం దొర్లిపోయింది. ఇప్పటికి ఆమె ఒక నిగూఢసత్యాన్ని గ్రహించింది. అనుభవశూన్యులైన యీ స్కూలు కుర్రాళ్ళను జేరనివ్వటమంత బుద్ధితక్కువలేదు!

క్రమంగా ఆమె దృష్టి ఇరుగు పొరుగు యువకుల మీదికి ప్రసరించింది. ఎదురింటి ప్లీడరుగారి తమ్ముడైతే..? ఆ కిటికిలోంచి ఎప్పుడూ గుడ్లగూబలాగా చూస్తూ కూర్చుంటాడు. తనను పెళ్ళాడినా తనకన్నా అందగత్తె కోసం మిగతా కిటికీల్ని కూడా తెరిచి ఇండియా మ్యాపులాటి తన ముఖాన్ని ఆ చువ్వల దగ్గర జేర్చక మానడు.

అదీకాక ప్లీడరుగారికి ఏముంది కనుకా? నెలకు నాలుగైదుసార్లన్నా తన యింటికి దేనికో వొకదానికి అప్పుకోసం రావల్సిందే! పొరపాటున యీ పెళ్ళి కనుక అయితే వాళ్ళ మొత్తం కుటుంబం ఆ ఇల్లు ఖాళీ చేసి తన ఇంట్లో శాశ్వత నివాసాన్ని ఏర్పరుచుకోక మానరు.

పోనీ డాక్టరుగారి బావమరిది అయితే..? చదువూ సంధ్యా శూన్యమైనా మంచి మంచి సూట్లు వేస్తాడు. ఏదో మంచి ఆస్తి వుంది కాని దుర్వ్యసనాలతో అదంతా తరగటం ప్రారంభమైంది. తాగి తందనాలాడేవాడు తనకు భర్త కావటం కన్నా దురదృష్టం ఇంకేం వుంటుందీ?

ఆలోచనలతో ఆమె బుర్ర బాగా వేడెక్కిపోయింది. ఏ ఆలోచనా లేకుండా ఉంటే ఎంతైనా బాగుండిపొయ్యేది. బుర్రలో కలిసిపోయిన ఆలోచనలన్నీ పొయ్యిమీది పాలలాగు పొంగి తెకతెకలాడసాగినయ్... అసలు తను యీ విధంగా ఒక్కొక్కర్నే ఏరిపారెయ్యటం మొదలుపెడితే ఇక మిగిలేదెవరో ఆమెకు తోచలేదు.

మర్నాడే పెళ్ళిచూపులకు ఎవరో వొస్తున్నారని విన్నది. ఆమాట చెప్పకుండా, కనీసం తనకు తెలియకుండానే ఏ రోడ్డుమీదనో తనను చూసిపోయినట్టయితే ఎంత బాగుండేది! ఆ కొత్త సమస్యతో ఆమె ఆలోచనలు మళ్ళీ రేగినయ్. ఆ ఆలోచనలు ఎంత భయంకరమైనవో ఆమెకు బాగా అనుభవం వుంది. ఆ వొచ్చే అతనికీ తనకూ ఒక వేళ వివాహం స్థిరమైతే? ఆ కొత్త వ్యక్తితో తనెలా సరిపెట్టుకోగలదు? పాతవాళ్ళలో కనిపించే లోపాలు ప్రస్తుతం కనిపించవు... కాని మొదటి రాత్రి నుంచే సుందర్రావులాటి గురక ప్రారంభమైతే...? అందులోనూ యీ వొచ్చే అతను రెండో పెళ్ళివాడట... ముసలాడేమో ఖర్మం! ఇక యీ సమస్య తన జీవితాంతంవరకూ తేలదా యేం?

ఏమైనా యీ విషయమై ఆలోచించటం మరీ అగాధాల్లోకిపోవడం. అది బాధో, ఆనందమో ఇంకేమైనాసరే మాట్లాడకుండా ఊరుకోవటమే ఉత్తమంగా తోచింది. మలేరియారోగి బలవంతాన కినైన్ మిక్శ్చర్ తాగినట్టు, చిన్నపిల్లవాడు ఎంత అగంచేసినా ఆముదాన్ని మింగితీరవలసినట్టు తనక్కూడా ఇది గురితప్పని సంఘటన...!

మర్నాడు అతను వొచ్చాడు. తనను చూశాడు. కాని తను అతన్ని చూడలేక పోయింది. ఒక భయంకర దృశ్యం గుండా సాగిపోతూన్నట్టు ఆమెకు తోచటం వల్ల ఆమె దృష్టి పనిచెయ్యలేదు... తీరా అతను వెళ్ళిపొయ్యాక, మనిషినన్నా చూసినా బాగుండేదనిపించింది. తల్లి వొచ్చి అడిగితే తను మాట్లాడలేదు. తన మౌనమే అంగీకారంగా తీసుకోబడ్డది.

వివాహ సమయంలోకూడా ఆమె దిగులుగా విచారంగా ఉండిపోయింది. ఇంతదూరం తనెలా రాగలిగిందో ఆమెకే ఆశ్చర్యంగావుంది. ఇష్టా యిష్టాల ప్రసక్తిలేని

పని చేస్తున్నప్పుడు మనం కాదనే మూఢనమ్మకం ఇచ్చే ఓదార్పు లాటిదేదో ఆమె గుడ్డిగా సాగిపొయ్యేందుకు సహాయం చేసి వుంటుంది.

తీరా మొదటి రాత్రి అతని బాహుపంజరంలో ఇరుక్కున్నాక గురితప్పని ఉరితాటిలో మెడ ఇరుక్కున్నట్టూ, ఇప్పుడే నిద్రమెలకువ వొచ్చి ఇది కలకాదనే నమ్మకాన్ని రూపించినట్టూ ఆమె గ్రహించింది. అయిందేమో అవనే అవుతుందనే మొండిధైర్యంతో ఆమె మనస్సు నిండిపోయింది. ఇందాకటినుంచీ అతను లాలించి మాట్లాడిస్తూన్నా తనకు భాషే తెలియనట్టు, మూగపిల్లలాగా ఊరుకోవటం చాలా హాస్యాస్పదంగా తోచింది.

మరుక్షణంలో ఆమె అతన్ని చూసింది. ఆనాడు పెళ్ళిపీటలమీద ఎవరినైతేచూసి, లోకంలోని గొప్ప అదృష్టాల్లో అతని భర్తృత్వాన్ని జమకట్టిందో అతను. ఎలాటివాడు తనకు కావాలనుకుందో, ఎవర్ని చూసి తను యీ రెండేళ్ళూ వివాహసమస్యలో ఉక్కిరిబిక్కిరవుతూ, దరీదాపూ కానకుండా వుందో చివరకు అతనే లభ్యమయ్యాడు.

కాని ఎంగిలాకుదగ్గరికి జేరినట్టుగా ఆమెకు తోచింది. ఏ కారణాలవల్లనో కాని, ఆ క్షణంనుంచే ఆమెకు అతనంటే వెలిబుచ్చలేని అసహ్యం ఆరంభమైంది.

– మే 1947